ఇబ్బందులు పెట్టకుండా యూరియా సరఫరా చేయాలి

ఆర్‌పీఐ దక్షిణాభారత ఉపాధ్యక్షురాలు డా. దివ్యచందన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో రైతులను ఇబ్బంది పెట్టకుండా యూరియాను వెంటనే సరఫరా చేయాలని ఆర్‌పీఐ దక్షిణాభారత ఉపాధ్యక్షురాలు డా. దివ్యచందన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... భారతదేశానికి ప్రతి ఏడాది 360 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందన్నారు. అయితే 2014లో కేవలం 225 మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు జరుగగా ప్రస్తుతం 310 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగిందన్నారు. యూరియా సరఫరా విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం ఆరోపణలు చేసుకోవడం మానుకుని రైతుల కష్టాలు తీర్చాలన్నారు. అలాగే దీర్ఘకాలంలో రైతులు సహజ సేంద్రియా ఎరువులు, బయో ఫర్టిలైజర్ల వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు.

సిద్దిపేట న్యాయవాదులు క్షమాపణలు చెప్పాలి

సుప్రీంకోర్టు న్యాయవాది కృష్ణస్వరూప్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డాక్టర్ బీఆర్ గావాయ్‌పై కుల వివక్షను చూపిస్తూ అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన సిద్దిపేటకు చెందిన అడ్వకేట్లను తక్షణమే అరెస్టు చేయాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, అడ్వకేట్స్ ఫోరం జాతీయ చైర్మన్, సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డీజీపీలు సైతం స్పందించాలన్నారు. చీఫ్ జస్టిస్ పట్ల గౌరవం లేకుండా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన సిద్దిపేట అడ్వకేట్లకు న్యాయవాద వృత్తిలో కొనసాగే నైతిక హక్కులేదని అన్నారు. బార్ కౌన్సిల్ వారి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర హైకోర్టు సుమోటాగా చర్యలు చేపట్టాలని కోరారు. వారిద్దరు జ్యూడీషియల్ వ్యవస్థ, సుప్రీంకోర్టుకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని కోరారు.

నేలకొరిగిన భారీ వృక్షం.. తప్పిన ప్రమాదం


బర్కత్‌పురలో చెట్ల కొమ్మల తొలగింపును పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమారాణి

కాచిగూడ: బర్కత్‌పుర రెడ్డి కాలేజ్ రోడ్డులో మంగళవారం భారీ వృక్షం విరిగిపోయి రోడ్డుపై పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ వెంటనే స్పందించి సమస్యను అధికారులకు, సిబ్బందికి వివరించి చెట్ల కొమ్మలను ప్రజలకు ఇబ్బందులు లేకుండా వెంటనే తొలగించాలని కోరారు. చెట్ల కొమ్మలను జీహెచ్‌ఎంసీ, హైడ్రా సిబ్బంది చెట్ల కొమ్మలను తొలగింప జేశారు. కార్యక్రమంలో బీజేపీనేతలు బల్వీర్, బి.భీమ్‌రాజ్, కృష్ణ, రాము, సూరి, తదితరులు పాల్గొన్నారు.

నియామకం


నియామకపత్రం అందుకుంటున్న రమేష్‌కుమార్ యాదవ్

కవాడిగూడ: బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ యువజన సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రమేష్‌కుమార్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య మంగళవారం ఆయనకు నియమక పత్రాన్ని అందజేశారు. తన మీద నమ్మకంతో బాధ్యతలు అప్పజెప్పిన ఆర్.కృష్ణయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని రమేష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జిల్లపల్లి అంజి, పగిల్ల సతీష్, రవి, రామ, శివ, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


జేసీబీ ట్రీ కటర్ వెళ్లేందుకు వీలుగా నల్లకుంట రైల్వేట్రాక్ వద్ద ప్రహరీ కూల్చిన దృశ్యం

శిథిలావస్థలో రైల్వేట్రాక్ ప్రహరీ


విజ్ఞానపురికాలనీలో కూలిన రైల్వే ట్రాక్ ప్రహరీ


మోరం క్వారీలేన్ సమీపంలో కూలిన రైల్వే ట్రాక్ ప్రహరీ

నల్లకుంట: డివిజన్ పరిధిలోని విద్యానగర్ రైల్వే స్టేషన్ నుంచి తిలక్‌నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జీ ఎంఆర్‌సీబీ వరకు రైల్వే ట్రాక్‌కు రెండు వైపులా దశాబ్దాల క్రితం ప్రహరీ నిర్మించారు. కాలక్రమేణ ప్రహరీ శిథిలావస్థకు చేరడంతో చాలా చోట్ల కూలిపోతోంది. శిథిలావస్థకు చేరిన ప్రహరీ మరి కొన్ని చోట్ల ఎప్పుడు కూలి ఎవరిపై పడి ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ట్రాక్ వెంట ప్రహరీ చాలా చోట్ల కూలిపోతోంది.

◆ కూలిన ప్రహరీ శిథిలాలు పూర్తిగా రోడ్డుపైకి చేరుతుండడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ట్రాక్ ప్రహరీ స్థలం రైల్వే శాఖ పరిధిలోకి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ ద్వారా ప్రహరీ నిర్మాణం చేపట్టేందుకు వీలు లేదు. ఈ ప్రహరీ నిర్మాణం జరుగాలంటే రైల్వే అధికారుల అనుమతులు తప్పనిసరి. అందుకు ప్రజాప్రతినిధులు స్పందించి రైల్వే శాఖ అధికారులతో మాట్లాడి కూలిన ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

కేంద్రమంత్రి చొరవ తీసుకోవాలి..

◆ శిథిలావస్థకు చేరిన రైల్వే ప్రహరీ రైల్వే శాఖ పరిధిలోకి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యపై స్థానిక కార్పొరేటర్ అమృత స్పందించి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నారు.

ప్రహరీ కూలిన ప్రాంతాలు..

◆ రైల్వేట్రాక్ వెంట ఉన్న చెట్ల కొమ్మలు, పిచ్చి మొక్కలను తొలగించేందుకు జేసీబీ, ట్రీ కటర్ వెళ్లేందుకు వీలుగా విద్యానగర్ రైల్వేస్టేషన్ వద్ద విజ్ఞానపురి కాలనీ గుడిసెల సమీపంలో రైల్వే ట్రాక్ ప్రహరీ కూల్చివేశారు.

◆ చాలా రోజుల క్రితం నల్లకుంట మోరం క్వారీ సమీపంలో ప్రహరీ బండరాళ్లు కూలిపడిపోయాయి. దానికి సమీపంలోనే మరో చోట ప్రహరీ ఓ వైపుకు ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు చాలా చోట్ల రైల్వే ట్రాక్ ప్రహరీ కూలుతోంది.

త్వరలోనే ప్రహరీ నిర్మాణం

దశాబ్దాల క్రితం నిర్మించిన రైల్వే ప్రహరీ చాలా చోట్ల కూలిపోతోంది. ఈ సమస్యను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దృష్టి తీసుకెళ్లాను. మంత్రి రైల్వే అధికారులతో చర్చించి ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. రైల్వే అధికారులు ప్రహరీ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాధనలు కూడా తయారు చేయించారు. విద్యానగర్ రైల్వే స్టేషన్ సమీపం నుంచి తిలక్‌నగర్ రైల్వే ట్రాక్ వరకు రైల్వే ట్రాక్ వెంట ఏపుగా పెరిగిన చెట్లు కొమ్మలు, పిచ్చి మొక్కలను తొలగించేందుకు రైల్వే కాంట్రాక్టర్ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ట్రాక్‌పైకి జేసీబీ వెళ్లేందుకు వీలుగా నల్లకుంట రైల్వే ట్రాక్ వద్ద కొంత మేర ప్రహరీని తొలగించారు. చెట్ల కొమ్మల తొలగింపు పూర్తి కాగానే ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభిస్తారు.

– అమృత, కార్పొరేటర్

'రెండు లక్షల ఉద్యోగాలు' హామీ ఏమైంది.?


అశోక్‌నగర్‌లో లక్ష సంతకాల సేకరణ ఉద్యమంలో సంతకాలు చేస్తున్న నిరుద్యోగులు

చిక్కడపల్లి: కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే అశోక్‌నగర్‌లో రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెస్తే రెండు లక్షల ఉద్యోగాలు ఏడాదిలోనే కల్పిస్తామని హామీ ఇచ్చి ప్రస్తుతం మరిచిపోయారని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనునాయక్ విమర్శించారు. అశోక్‌నగర్‌లో బీఆర్‌ఎస్వీ చేపట్టిన లక్ష సంతకాల సేకరణ ఉద్యమానికి మంగళవారం శ్రీనునాయక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిరుద్యోగ విద్యార్థులు స్వచ్ఛందంగా వచ్చి సంతాకాలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఉద్యోగుల హామీని మరిచిపోయిందన్నారు. గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల్లో అవతవకలు జరిగాయని సాక్షాత్తు హైకోర్టు తీర్పునిచ్చిందన్నారు. హైకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం స్కామ్‌కు పాల్పడిన వారిని కాపాడే విధంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని హైకోర్టు న్యాయమూర్తి సుమోటో కేసుగా స్వీకరించాలన్నారు.స్కామ్‌కు పాల్పడినే వారిని శిక్షించే విధంగా జ్యూడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు మిద్దె సురేష్, గోపాల్‌నాయక్, ఓయూ విద్యార్థి నాయకులు నవీన్‌నాయక్, అనిల్, అశోక్‌నగర్ నిరుద్యోగ జేఏసీ నాయకులు సురేష్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

గ్రూప్–1 నియామకాలు జరపకపోవడం విచారకరం

రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు


నగర కేంద్ర గ్రంథాలయంలో నిరుద్యోగులతో మాట్లాడుతున్న రాంచందర్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి

చిక్కడపల్లి: ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయకుండా నిరుద్యోగులను మోసం చేస్తోందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఆరోపించారు. మంగళవారం ఆయన చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో నిరుద్యోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పదకొండేళ్లుగా గ్రూప్–1 నియామకం జరపకపోవడం విచారకరమని అన్నారు. ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని పేర్కొన్నారు. యూపీఎస్సీ మాదిరిగా నియామకాలను చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యూత్ డిక్లరేషన్ చేసి అమలు చేయడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. టీజీపీఎస్సీ మీద ప్రభుత్వానికి శ్రద్ధలేదని విమర్శించారు.

◆ నిరుద్యోగుల హక్కుల వేదిక అధ్యక్షుడు అశోక్‌కుమార్ నోటిఫికేషన్లను విడుదల చేయాలని ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. తాను రాజకీయం చేయడానికి రాలేదని.. నిరుద్యోగులకు అండగా ఉంటామని అన్నారు. అరెస్టు చేసిన నిరుద్యోగులను వెంటనే విడుదల చేయాలన్నారు.

◆ ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సహకారంతో కోర్టులో నిరుద్యోగుల తరఫున కొట్లాడతామన్నారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ గ్రూప్–1లో జరిగిన అవకతవలపై సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌతంరావు, నేతలు మద్దూరి శివాజీ, నిరుద్యోగ విద్యార్థులు పాల్గొన్నారు.

'స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్'

ముషీరాబాద్: మహిళలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలలో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని అంబర్‌పేట క్లస్టర్ ఎస్‌పీహెచ్‌వో డా. పద్మజ తెలిపారు. మంగళవారం ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో 'స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్'అభియాన్‌లో భాగంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా ఎస్‌పీహెచ్‌వో హాజరై మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. 587 మందికి సాధారణ వైద్య పరీక్షలతో పాటు ప్రత్యేక వైద్య సేవలను అందించామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా. మనోజ్‌రెడ్డి, వైద్యులు మల్లికార్జున్, సౌమ్యారెడ్డి, తులసీ, లక్ష్మీదేవి, రాచకుందన, హప్సా, పూజిత, షేక్ దిల్‌రూబా, హర్షియా పాల్గొన్నారు.

తాత్కాలిక ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

నల్లకుంట: తెలంగాణ రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ కార్పొరేషన్లలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానంలో తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్న వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వానికి లేక రాశానని జీహెచ్‌ఎంసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ ఆకుల శ్రీనివాస్ ప్రభుత్వానికి లేక రాశారు. గత పాలకులు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ చట్టాన్ని పక్కన పెట్టి ఈ వ్యవస్థను తాత్కాలిక విధానంలోకి మార్చి అమలు చేసిందన్నారు. ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాన్ని పరిశీలించి తమకు న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. అలాగే వేతన బకాయిలు లేకుండా ప్రతి నెల వేతనాలు చెల్లించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కొందరిని ఉద్యోగాల నుంచి అక్రమంగా తొలగించారని ఓ ఉద్యోగి మనస్థాపంతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. పీఎఫ్, ఈఎస్ఐ జమ చేయకుండా తాత్సారం చేస్తున్న ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


అక్కినేని జీవన సాఫల్య, మీడియా విశిష్ట ప్రతిభా పురస్కారాల గ్రహీతలతో మంత్రి వివేక్‌వెంకటస్వామి

నిబద్ధతతో పనిచేసినప్పుడే గుర్తింపు

మంత్రి వివేక్‌వెంకటస్వామి

చిక్కడపల్లి: వృత్తిలో నిబద్ధతతో పనిచేసినప్పుడే ప్రజల్లో గుర్తింపు, గౌరవం లభిస్తుందని మంత్రి వివేక్‌వెంకటస్వామి అన్నారు. మంగళవారం రాత్రి శృతిలయ ఫౌండేషన్, సీల్వెల్ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో అక్కినేని జీవన సాఫల్య, మీడియా విశిష్ట ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్‌రావు, బసవపున్నయ్య, కృష్ణప్రసాద్, శివరామప్రసాద్, హేమ సుందరావు, అంజలిరెడ్డి, చంద్రికలకు పురస్కారాలను ఆయన ప్రదానం చేసి సన్మానించి మాట్లాడారు. మీడియా రంగంలో పనిచేస్తూ ప్రజాభిమానాన్ని పొందుతున్న వారిని సత్కరించడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు దైవజ్ఞశర్మ, రఫీ, అనూహ్యారెడ్డి, శ్రీమణి, భోగరాజు, గాయని ఆమని, శ్రీధరాచారి, హరినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే లక్ష్యంగా ముందుకు


బాగ్‌లింగంపల్లిలో జరిగిన అబ్రెపోస్ వార్షిక సమావేశంలో చైర్మన్ కంచినాదం సత్యప్రసాద్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆంధ్రాబ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయిస్ ప్రాజెక్ట్స్ ఆఫ్ సెల్ఫ్ ఎంగేజ్‌మెంట్ (అబ్రెపోస్) చైర్మన్, ఎండీ కంచినాదం సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో అబ్రోస్ 33వ వార్షిక సాధన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సత్యప్రసాద్ మాట్లాడుతూ... ఆంధ్రా బ్యాంకులో రిటైర్డ్ అయిన ఉద్యోగులు వారి అనుభవం, సామర్థ్యాన్ని సమాజానికి ఉపయోగించాలన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు 10శాతం డివిడెండ్లను ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కంపెనీ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు వాటాదారులకు నిరంతరం ప్రతి ఏడాది సగటున 10 శాతం డివిడెండ్లు లభిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం కంపెనీ చెల్లించిన మూలధనం రూ.3.42 కోట్లు కాగా, రిజర్వులు రూ.1.27 కోట్లని తెలిపారు. రిజర్వు బ్యాంక్ నిబంధనలకు అనుగుణంగానే తమ అబ్రెపోస్ నడుచుకుంటుందని అన్నారు. భవిష్యత్‌లో ఈ కంపెనీ వాటాదారుల ప్రోత్సాహంతో ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్లు కె. శ్రీనివాస్‌రావు, హెచ్.శేషగిరిరావు, నంద్యాల సూర్యనారాయణ, సీహెచ్.గోపాల కృష్ణ, ఎల్ఎస్ఆర్ మూర్తి, పీవీ శ్రీనివాసరావు, ఎం.వరదరాజన్, కె.రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమబోర్డు ద్వారా పథకాలు ఇవ్వాలి


కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నేతలు

చిక్కడపల్లి: సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు పథకాలను అమలు చేయాలని తెలంగాణ బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రామ్మోహన్ రావు, కోటంరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట వారు నిరసనకు దిగారు. అనంతరం వారు మాట్లాడుతూ... కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డులో పెండిగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌కు వెంటనే నిధులను మంజూరు చేయాలన్నారు. సంక్షేమ బోర్డులో జరిగిన నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. అనంతరం కార్మికశాఖ ఉపకమిషనర్ శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు జంగయ్య, వెంకన్న, రాజు, మోహన్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ లైసెన్స్ లేని వస్తువులను విక్రయించొద్దు

కవాడిగూడ: ఫుడ్ లైసెన్స్ లేకుండా తయారు చేసిన వస్తువులను కిరాణా దుకాణాల్లో విక్రయించొద్దని వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు దుకాణాల యజమానులకు సూచించారు. కవాడిగూడలో లీగల్ మెట్రాలజీ రూల్స్ అండ్ రెగ్యూలేషన్స్ తెలియజేస్తూ మంగళవారం దుకాణాదారులకు అవగాహన కల్పించారు. వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం 2019 ప్రకారం పడే శిక్షలను వారికి వివరించారు. చిన్న పిల్లలు తినే బన్, బిస్కెట్, చాక్లెట్స్, మురుకుల్, మిక్చర్ వంటి వాటిపై తయారుదారి వివరాలతో పాటు కంపెనీ పూర్తి అడ్రస్, గడువు తేదీలు, ధర తప్పనిసరిగా ఉంటేనే విక్రయించాలని సూచించారు. అక్టోబర్ 6న వినియోగదారులకు అవగాహన కార్యక్రమాన్ని కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు శివకుమార్, రవి, కిరణ్‌కుమార్, ప్రభాకర్, రాజు, ప్రీతి, రమేష్, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆప్ జిల్లా అధ్యక్షుల నియామకం



కవాడిగూడ: ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థులు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా పోటీలో ఉంటారని ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. మంగళవారం లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో జిల్లా నూతన దశలో నియామక కార్యక్రమాన్ని చేపట్టారు. మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా నయీంపాషా, నిర్మల్ జిల్లా అధ్యక్షుడిగా సయ్యద్ హైదర్‌కు నియామక పత్రాలు అందజేశారు.

మహిళా శక్తికి నిలువెత్తి ప్రతీక బతుకమ్మ


బతుకమ్మ కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న దేవకి దేవి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మహిళా శక్తికి నిలువెత్తి ప్రతీక బతుకమ్మ అని ప్రముఖ కవయిత్రి దేవకి దేవి అన్నారు. తెలంగాణ ప్రజల అస్థిత్వాన్ని ఆత్మ గౌరవాన్ని బతుకమ్మ పెంపొందించిందన్నారు. మంగళవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీపీఎస్‌కే, తెలంగాణ సాహితి సంయుక్త ఆధ్వర్యంలో బతుకమ్మపై కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవకి దేవి మాట్లాడుతూ... బతుకమ్మ అంటే ఒక ఉత్సవమే కాదు ఉద్యమం కూడా అని అన్నారు. బతుకమ్మ తెలంగాణ ప్రజల జీవితంలో అంతర్భాగమై వేలాది సంవత్సరాల నుంచి ఒక ఉత్సవంగా జరుపుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహితీ ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి, టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, సలీమా, రేఖ, మోహనకృష్ణ, నస్రీన్ ఖాన్, యాకమ్మ, అరుణజ్యోతి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రులు

దేవీ శరన్నవరాత్రి వేడుకలు కనులపండువగా జరుగుతున్నాయి. అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లోని ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలు, మండపాల వద్ద అన్నదానం ,హోమాలు నిర్వాహించారు. శంకరమఠంలో శారదా మాతను మహేశ్వరి రూపంలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

– అంబర్‌పేట,ముషీరాబాద్ జోన్ బృందం


అంబర్‌పేట మహంకాళి ఆలయంలో జరిగిన పూజలో మాజీ ఎంపీ వీహెచ్


బతుకమ్మకుంట మైసమ్మ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకల్లో భక్తులు


న్యూరామాలయంలో చండీ హోమం నిర్వహిస్తున్న వేదపండితులు


వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న చైర్మన్ జానకీసుధాకర్


ముషీరాబాద్ మహంకాళి ఆలయంలో మాజీ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి




ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన భారీ దుర్గామాత పూజలో బీఆర్‌ఎస్ నాయకులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010463222